మామిడి పూతపై మంచు పంజా


లింగపాలెం మండలంలో మంచుతో రాలిపోతున్న మామిడి పూత


మంచు కారణంగా పూత రాని మామిడి తోట

- తేనె మంచుతో రాలుతున్న మామిడి పూత
- ఈ ఏడాది అంతంతమాత్రంగానే దిగుబడులు
- ఖర్చులు కూడా అధికమవుతున్నాయని రైతుల ఆవేదన

లింగపాలెం: మామిడి, జీడిమామిడి పూతపై మంచు పంజా విసురుతోంది. కొన్నిరోజులుగా దట్టంగా కురుస్తున్న తేనె మంచు ప్రభావంతో మామిడి పూత రాలిపోతుందని లింగపాలెం మండలంలోని రైతులు, వ్యాపారస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే దిగుబడులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయని వాపోతున్నారు. మొదట్లో మామిడి, జీడి మామిడి విరగ పూయడంతో ఎన్నో ఆశలు పెట్టుకుని అధిక ధరలకు కొనుగోలు చేశామని, కాని ప్రస్తుతం తేనె మంచు దెబ్బకు పూత రాలిపోతోందని, ఎన్ని మందులు కొట్టినా ఫలితం ఉండడం లేదని రైతులు, వ్యాపారస్తులు చెబుతున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

గతంలో మండలంలో 1,500 హెక్టార్లలో మామిడి పంటను సాగుచేయగా, రైతులు క్రమేపీ ఇతర పంటలపై ఆసక్తి చూపడంతో ప్రస్తుతం 400 హెక్టార్లకు పరిమితమైంది. ఈఏడాది మామిడి తోటలు పూతలు ఆశాజనకంగా లేనప్పటికీ తేనె మంచుతో పూత రాలిపోతుందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీన్ని అరికట్టేందుకు అనేక మందులు వాడినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. దీనికితోడు ఈఏడాది పురుగుమందుల ధరలు కూడా పెరిగిపోవంటతో గతంలో కంటే రెండు రెట్లు ఖర్చు ఎక్కువ అవుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలో ఎక్కువ శాతం బంగినపల్లి, రసాలు, తూతా, నీలాలు వంటి అనేక రకాలు సాగులో ఉన్నాయి. పూత రాలకుండా ఉంటే సుమారు లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు, వ్యాపారస్తులు వాపోతున్నారు.

ఖర్చులు బాగా పెరిగాయి



తేను మంచుతో మామిడి దిగుబడులు తగ్గనున్నాయి. ఎరువులు, పురుగుమందుల ఖర్చులు బాగా పెరిగిపోయాయి. పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి. కూలీ రేట్లు పెరిగాయి. మార్కెట్, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే పెట్టిన ఖర్చులు వస్తాయి.

– సీహెచ్ రఘునాథరెడ్డి, రైతు, లింగపాలెం

తేనె మంచు ప్రభావంతో నష్టాలే

మొదట్లో పూతను చూసి మామిడి, జీడిమామిడి తోటలను అధిక పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేశాం. ఈఏడాది దిగుబడులు బాగుంటాయని, అధిక ధరలకు కాయలకు తోటలను కొనుగోలు చేశాం. కాని నేడు తేనె మంచు ప్రభావంతో మామిడి, జీడిమామిడి పూతలు రాలిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– కె వెంకటేశ్వరరావు, వ్యాపారస్తుడు

మన్యం బంద్ విజయవంతం


ఏజెన్సీలో బంద్ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వేలేరుపాడు: మండలంలోని 1/70 పరిరక్షణకు రాష్ట్ర అఖిలపక్ష ప్రజా సంఘాల పిలుపులో భాగంగా బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వేలేరుపాడు మండల కేంద్రం నుంచి మేడేపల్లి వరకు బైక్ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ అధ్యక్షత వహించారు, గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కారం ధారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు, ఆదివాసీ మహాసభ మండల అధ్యక్షుడు ఎం.రాంబాబు, జీఎస్పీ మండల అధ్యక్షులు బంధం ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ఉన్న ఆదివాసీల భూములు ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారుల అసమర్థతతో నేడు అక్రమ కట్టడాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ప్రభుత్వం భవిష్యత్‌లో ఆదివాసీలకు రక్షణగా ఉండే చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందని ఆదివాసీ సమాజం భావిస్తుందన్నారు. దీనికి కొనసాగింపుగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గిరిజనేతరులు గిరిజన సంక్షేమ సంఘాలు పెట్టాలని వారికి సూచించడం చూస్తుంటే, ఆదివాసీలకు అండగా ఉండాల్సిన వారే ఈ రకమైనటు వంటి వ్యాఖ్యలు చేయటం విడ్డూరంగా ఉందని ఏద్దేవా చేశారు. బాడిశ రాము, కారం వెంకటరావు, పిట్టా ప్రసాద్, పూసం రాంబాబు, కరటం ప్రకాష్, కట్టం వెంకటేష్, గంగరాజు, శ్రీను పాల్గొన్నారు.

శిథిల కల్వర్టులో పడి వ్యక్తికి గాయాలు


ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వెంకటేష్

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలోని కల్వర్టు గోతిలో ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న బి.వెంకటేష్ కల్వర్టు గోతిలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఈ కల్వర్టు గత అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. కనీస మరమ్మతులు చేపట్టకపోవడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత నెల 27వ తేదీ రాత్రి దిప్పకాయలపాడుకు చెందిన బాలాజీ ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తూ కల్వర్టులో పడి తీవ్ర గాయాలపాలైన సంఘటన పాఠకులకు విధితమే. అయితే ఆ కల్వర్టు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మరో ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు మండిపడుతున్నారు. వచ్చే నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ జాతరకు లక్షలాది మంది ప్రజలు ఈ రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సి ఉంది. అయితే కనీస మరమ్మతులు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు జి.పవన్, జంపాలు, మంగారాజు తెలిపారు.

వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి


ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి నియోజకవర్గ ప్రజలే కాకుండా సరిహద్దు జిల్లాలైన కష్టా, ఖమ్మం జిల్లాల నుంచి అనేక మంది రోగులు నిత్యం వస్తుంటారని తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో 23 డాక్టర్ పోస్టులు ఉండగా, కేవలం 11 మంది వైద్యులు మాత్రమే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న 12 వైద్యుల పోస్టులను కూడా భర్తీ చేయాలని పట్టణంలో సంతకాల సేకరణ చేసి వినతి పత్రాన్ని అందజేసినట్లు సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య తెలిపారు. కార్యక్రమంలో తుర్లపాటి బాబు, దొంత కృష్ణ, ఎస్‌కే కాలేషా, ముళ్లగిరి అలెగ్జాండర్, తక్కెలపాటి ప్రసాద్‌రావు, తాడిగడప మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

డీ-ఫారం రైతులకూ విశిష్ట సంఖ్య ఇవ్వాలి


విశిష్ట సంఖ్య నమోదు చేయాలని ఆందోళన చేస్తున్న డీ-ఫారం రైతులు

ద్వారకాతిరుమల: ఇటీవల వ్యవసాయశాఖ ద్వారా చేపట్టిన రైతు విశిష్ట సంఖ్య నమోదులో డీ-ఫారం భూముల రైతులకు చుక్కెదురైంది. మండలంలోని తిరుమలంపాలెం గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ ద్వారా అధికారిక వెబ్‌సైట్‌లో నమోదుకు కొందరు రైతులు మంగళవారం ప్రయత్నించారు. అయితే రైతు విశిష్ట సంఖ్య నమోదు కాలేదు. డీ-ఫారం పట్టా భూమి కావడం వల్లే నమోదు కాలేదని రైతు బంటు మిల్లి బాలకృష్ణ వాపోయారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులకు చెందిన చిన్న, సన్నకారు రైతులు నూటికి 90 శాతం మంది డీ-ఫారం భూములు కలిగి ఉన్నారని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఈ విశిష్ట సంఖ్య ఆధారంగా రైతులకు పలు రాయితీలు మంజూరు చేస్తారని ప్రచారం జరుగుతోందని, ఇలాంటి సమయంలో ఈ చిక్కుల కారణంగా తీవ్రంగా నష్టపోతామని డీ-ఫారం రైతులు దోళన చెందుతున్నారని బాలకృష్ణ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు కోరుతున్నారు. డీ-ఫారం, కౌలు రైతులకు సైతం విశిష్ట సంఖ్య ఇవ్వాలని రైతులు గుడెల్లి వెంకట్రావు, ఉప్పే ధనుంజయరావు డిమాండ్ చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


పోలవరం రూరల్: పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు


కొయ్యలగూడెం: వేదాంతపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పోలవరం రూరల్: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని గూటాల, కొత్త పట్టిసీమ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త పట్టిసీమ రైతు సేవా కేంద్రం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నాగేంద్రబాబు పర్యటించి రైతులకు సూచనలు చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

కొయ్యలగూడెం: వేదాంతపురం, రామానుజపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి చెన్న కేశవులు మాట్లాడుతూ మండలంలోని భూమి గల ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్టర్ చేసుకున్న ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుందని ఇది అనేక ప్రభుత్వ పథకాలకు అనుసంధానం చేస్తారన్నారు.

13 నుంచి ఆర్‌అండ్‌ఆర్ గ్రామ సభలు

వేలేరుపాడు: మండలంలో 41.15వ కాంటూర్ జాబితాలో చేర్చిన 14 గ్రామాల్లో ఈ నెల 13 నుంచి 19 వరకు వరకు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు నిర్వహించనున్నట్లు వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ నెల 13న వేలేరుపాడు మండలంలోని కొత్తూరు, తూర్పుమెట్ట, గ్రామాల నిర్వాసితులకు నార్లవరం గ్రామ పంచాయతీ సచివాలయంలో, 14న బోళ్లపల్లి, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రమెట్ట, గ్రామాల నిర్వాసితులకు బోళ్లపల్లి పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న టేకూరు, చింతలపాడు, సిద్దారం నిర్వాసితులకు టేకూరు పాఠశాలలో, 18న కాచారం, 19న పేరంటపల్లి, కాకిస్‌నూరు, టేకుపల్లి, పెద్దమంకోలు గ్రామాలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘంటసాలకు ఘన నివాళి


ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసిన అభిమానులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఘంటసాల 52వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు సుబ్బయ్య చారి ఘంటసాల విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఆర్, ఎంఎస్‌ఆర్, తాతాజీ ఘంటసాల విగ్రహానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఆర్ మాట్లాడుతూ ఘంటసాల పాట తెలుగుజాతి ఉన్నంతకాలం, చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. సీహెచ్‌ఆర్ మాట్లాడుతూ ఘంటసాల తాను పాడిన ఒక భగవద్గీత గానంతోనే తెలుగు వారి గుండెల్లో సుస్థిర స్థానం పొందారన్నారు. ఈ నెల 23వ తేదీన ఘంటసాల గాన విభావరి సుబ్బయ్యాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. స్థానిక కళాకారులు శివదాసు, రామకృష్ణ మాస్టారు, నారాయణ, నీరజ, గౌరీ పాల్గొన్నారు.

15న సేవాలాల్ మహరాజ్ జయంతి


కేఆర్‌పురంలో పీఓకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆహ్వాన కమిటీ ప్రతినిధులు

బుట్టాయగూడెం: ఈ నెల 15వ తేదీన సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను కోయరాజమండ్రిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీఓ కేతావత్ రాములు నాయక్‌ను మంగళవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీఓకు శాలువా కప్పి పుష్పకుచ్ఛం అందజేశారు. అనంతరం మోహన్‌రావు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ లంబాడీ, బంజారాల ఆరాధ్యదైవమని అన్నారు. అటువంటి మహనీయుడి గుడిని గత ఏడాది కోయరాజమండ్రిలో ఏర్పాటు చేసి ఎంతో వైభవంగా వేడుకలను నిర్వహించామని చెప్పారు. అలాగే ఈ ఏడాది కూడా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎస్‌ఆర్‌పాలెం ప్రధానోపాధ్యాయులు శ్యాంబాబు నాయక్, బానోతు అర్జున్ నాయక్, బానోతు శ్రీరామ్ మూర్తి, బానోతు శ్రీనివాస్, బానోతు కృష్ణ, భూక్యా ప్రసన్నదేవి, తదితరులు పాల్గొన్నారు.

మందుల తయారీలో రసాయన శాస్త్రం కీలకం


కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త తూముపాటి ప్రశాంత్

కామవరపుకోట: మందుల తయారీలో రసాయని శాస్త్రం ముఖ్య కీలకమని కామవరపుకోటకు చెందిన అమెరికాలో గల వర్జీనియా కామన్ వెల్త్ యూనివర్సిటీ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ తూముపాటి ప్రశాంత్ అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు రసాయన శాస్త్రం గురించి వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కామవరపుకోట: వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. మంగళవారం సాయంకాలం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గండ దీపాలు శిరస్సుపై ఉంచి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా లేని విధంగా కల్యాణం రోజు భక్తులు స్వామికి గండదీపాల మొక్కుబడి సమర్పించడం ఇక్కడ ప్రత్యేకత. సంతానం లేని వారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు స్వామికి గండ దీపాలతో మొక్కుబడి చెలిస్తే వారి కుటుంబాలు గండాల నుంచి బయటపడతారని ఇక్కడి భక్తులు విశ్వాసం. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు సాయంకాలం సమయంలో పాత్రలో నూనె పోసి దీపం వెలిగిస్తారు. ఆ దీపాన్ని శిరస్సుపై ఉంచి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. అదే రోజు రాత్రి అఖిల గాండ్ల తేలిల సంఘ ఆధ్వర్యంలో చేసే నారసాలు, కత్తి సాము, వీరంగం, గండ దీపాలు చూపరులను ఆకట్టుకుంటాయి. త్రిశూల ఆకారంలో ఉండే సూది మొనతో వెలుగుతున్న దీపాలు (నారసాలు) నాలుకపై గుచ్చుకుని చేసే వీర శైవ నృత్యం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత రవితేజకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన యమ్మనూరు రవితేజ ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచారి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అనంతరం స్వామి వారి ప్రసాదం అందించారు.

15న అయ్యప్ప ఆలయంలో పూజలు


అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం హరిహరసుత అయ్యప్ప స్వామి వారి ఆలయంలో ఈ నెల 15వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 15వ తేదీ శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అర్చకులు తేజ శర్మ ఆధ్వర్యంలో మండపారాధన, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, నీరాజన మంత్రపుష్పం తదతర పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తారని తెలిపారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు


మద్ది క్షేత్రంలో స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి పలు సేవల రూపేణా రూ.1,28,653 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1500 మంది భక్తులకు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారన్నారు. ఏర్పాట్లను జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షించినట్లు ఈవో చందన తెలిపారు.

గ్రామ సభ నిర్వహణ


గ్రామసభలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాములు నాయక్

కుక్కునూరు: లచ్చిగూడెం గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్, భూమికి–భూమి తదితర సమస్యలను పరిష్కరించే దిశగా మంగళవారం ఐటీడీఏ పీఓ రాములునాయక్ గ్రామ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాసితుల వద్ద నుంచి సమస్యలను సానుకూలంగా అడిగి తెలుసుకున్నారు. పీడీఎఫ్ కుటుంబాల లబ్ధిదారుల జాబితాను స్కీం అప్రూవల్‌కు చదివి వినిపించారు. కార్యక్రమంలో కుక్కునూరు తహసీల్దార్ కె.రమేష్ బాబు, ఎంపీడీఓ పీఎస్ఎన్ నరసింహరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

18 మంది దివ్యాంగులకు కాలిపర్స్ అందజేత


విర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవం అమర్చిన రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో 18 మంది దివ్యాంగులకు ప్రోస్తాసిస్ త్రీడీ ప్రింట్ కృత్రిమ అవయవాలను, కాలిపర్స్‌ను మంగళవారం అందజేశారు. గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో నెలకొల్పిన కేంద్రం ద్వారా వీటిని తయారు చేసినట్టు ప్రముఖ వైద్యులు ముక్కముల అప్పారావు, ముక్కముల పార్థసారథి తెలిపారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన నిందితులతో అధికారులు

చింతలపూడి: మండలంలోని పంతంగలగూడెం, సుప్రీంపేట గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. పంతంగలగూడెం గ్రామానికి చెందిన దారావతు శిరీష వద్ద నుంచి 10 మద్యం సీసాలు, సుప్రీంపేటకు చెందిన యాండ్రపతి సునీత వద్ద నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరు మహిళలపై బెల్ట్ షాపు కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదే విధంగా కామవరపుకోట మండలానికి చెందిన పాత నాటు సారా కేసులో నిందితులైన మేకా నాగేశ్వరరావు, పరసా కల్యాణంలను కామవరపుకోట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నాటు సారా పరారీ కేసులో నిందితురాలైన తనెగల మల్లెమ్మను అదుపులోకి తీసుకుని స్థానిక కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి దశలవారీ విద్యుత్

జంగారెడ్డిగూడెం: డివిజన్ పరిధిలోని ఆడమిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌కు సంబంధించి మరమ్మతులు చేస్తున్న కారణంగా వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్‌ను దశలవారీగా సరఫరా చేస్తామని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లకు ఈ నెల 12, 13 తేదీల్లో వ్యవసాయానికి సంబంధించిన త్రీఫేజ్ విద్యుత్‌ను ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల లోపు దశలవారీగా సరఫరా చేస్తామన్నారు.

షెడ్డు నిర్మాణానికి సాయం


చెక్కును అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: మానవత సేవా కార్యక్రమాలకు వసుధ ఫౌండేషన్ చేయూతగా నిలిచింది. జంగారెడ్డిగూడెం మానవత సంస్థ ఫ్రీజర్ బాక్సులు, అంబులెన్స్ పెట్టుకోవడానికి షెడ్డు నిమిత్తం సహాయాన్ని అందించింది. హైదరాబాద్‌కు చెందిన వసుధ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం రూ.లక్ష చెక్కును మావనత మండల అధ్యక్షుడు అయినాల రమణమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధులు చోడే ఫణి చంద్ర శేఖర్, కొండపల్లి పండు, కొండేపాటి రామకృష్ణ, ఇమ్మంది మాధవరావు, పల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మద్యం సరఫరా వ్యాన్ సీజ్

కుక్కునూరు: మండలంలో బెల్టు షాపులకు మద్యం డోర్ డెలివరీ చేస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు తెలిపారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసిన విషయంపై ప్రచార మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై స్పందించిన ఎక్సైజ్ శాఖ కుక్కునూరులో దాడులు నిర్వహించింది. బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇద్దరి నుంచి 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఏఈఎస్ సిబ్బంది, జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి మంగళవారం కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన సుమారు 200 మంది భక్తులు కాలినడకన విచ్చేశారు. గోవింద నామస్మరణలతో వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పాదయాత్ర భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

ఎడిసన్‌కు ఘన నివాళి

కొయ్యలగూడెం: విద్యుత్ బల్బు సృష్టి కర్త థామస్ అల్వా ఎడిసన్ 178వ జయంతిని మంగళవారం కుంతలగూడెంలో నిర్వహించారు. ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో ఎడిషన్ చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు.